క్లుప్తంగా

అక్రమ కట్టడాల కూల్చివేత



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంపౌండ్ వెనుక భాగంలో అక్రమ కట్టడాలను అధికారులు సోమవారం కూల్చివేశారు. అంగన్‌వాడీ కేంద్రం పక్కన గ్రామ కంఠం భూమిని ఖాజ అనే వ్యక్తి ఆక్రమించుకొని గొర్రెల షెడ్డు నిర్మించారు. దీంతో విషయాన్ని తెలుసుకున్న అధికారులు తహసీల్దార్ మురళీగౌడ్, ఎంపీఓ రాజు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ రాధకృష్ణ, కార్యదర్శి నందకిషోర్ కలిసి స్థలాన్ని పరిశీలించి గొర్రెల షెడ్డు తొలగించారు. అనంతరం ప్రధాన రహదారి మీద నిర్మించిన ఇంటి కాంపౌండ్‌ను కూడా కూల్చివేశారు. పాఠశాల కాంపౌండ్ చుట్టూ రూ.లక్షల విలువ గల గల స్థలాన్ని ఆక్రమించారు. వీరికి నోటీసులు అందజేయాలని కార్యదర్శికి సూచించారు.

బాలికల ఉన్నత పాఠశాలలో నీటి వృథా



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నీటి వృథా అవుతున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పాఠశాలలో బాత్‌రూంలపై ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు నిండి నీరు వృథాగా పోతున్నా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఒక పక్క నీరును పొదుపుగా వాడుకోవాలని చెబుతున్నా.. ఈ పాఠశాలలలో ప్రతి రోజు ట్యాంకు నిండి నీరంతా వృథాగా పోతుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు స్పందించి ట్యాంక్ నిండిన వెంటనే నీటిని నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు.

కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

పెబ్బేరు రూరల్: జిల్లాలో కొత్తగా రేషన్ కార్డులు, ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్లను అర్హులకు వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ సోమవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో దాదాపు 15 వేల రేషన్ కార్డులు మంజూరైనా ఒక్కరికి కూడా కార్డులు ఇవ్వలేదన్నారు. నూతన ప్రభుత్వం వాటితో పాటు ప్రజా పాలనలో దరఖాస్తు పెట్టుకున్న వారికి కార్డులు వెంటనే ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఉచిత సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు అవసరం అవుతుండడంతో వేగంగా మంజూరు చేసి పేదలను ఆదుకోవాలన్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద తాగునీరు, కరెంటు, డ్రెయినేజీ, సీసీరోడ్లు నిర్మాణం చేయాలని మంత్రి, ఎమ్మెల్యేలను కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

విజయసంకల్ప యాత్రకు ఘన స్వాగతం



వీపనగండ్ల: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం చేపట్టిన విజయసంకల్ప యాత్ర సోమవారం గోవర్ధనగిరికి చేరుకోవడంతో వీరికి మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రంలో బీజేపీని గెలిపించేందుకు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్న ఉద్దేశంతో ఈ యాత్ర చేపట్టినట్లు కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో బంగారు శృతి, యాత్ర ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు, నాయకులు శ్రీనివాసులు, శ్రీధర్‌రెడ్డి, రాకేష్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

గణిత ప్రతిభ పాటవ పరీక్ష

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గణిత ప్రతిభ పాటవ పరీక్ష మార్చి 1న ఉదయం 10గంటలకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు. ప్రతిభ కనబర్చి విద్యార్థులకు ప్రథమ బహుమతి కింద రూ.వెయ్యి, ద్వితీయ బహుమతి కింద రూ.600, తృతీయ బహుమతిగా రూ.400 ఇవ్వడంతో పాటు మెమొంటోలు ఇస్తామన్నారు. సిలబస్ 5వ తరగతి గణితం పుస్తకం నుంచి చతుర్విధ ప్రక్రియలపై మల్టీపుల్ క్వశ్చన్స్ ఉంటాయని, 60ప్రశ్నలు 40మార్కులు ఉంటాయిని, ప్రతి పాఠశాల నుంచి 5వ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులను హెచ్‌ఎం తీసుకుని రావాలని సూచించారు.

నీరుగారుతున్న లక్ష్యం

- సమస్యల వలయంలో బౌసింగ్‌తండా ప్రాథమిక పాఠశాల
- నిరుపయోగంగా మరుగుదొడ్లు



బౌసింగ్‌తండా పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

మదనాపురం: గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు పెడుతున్నా క్షేత్రస్థాయిలో అనుకున్న లక్ష్యాలు సాధించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో విద్యార్థులు వెనుకబడి పోతున్నారు. మండలంలోని బోసింగ్‌తండా ప్రాథమిక పాఠశాలలో 34 మంది విద్యార్థులు చదువుతుండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

గది ఒకటి.. తరగతులు ఐదు

పాఠశాలలో ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న సమయంలో మూడు తరగతుల విద్యార్థులు సైలెంట్‌గా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కాంపౌండ్ వాల్ లేకపోవడంతో కుక్కలు, పందులు, విషసర్పాలు సంచరిస్తున్నాయి. పాఠశాలలో మరుగుదొడ్లు సైతం నిరుపయోగంగా ఉన్నాయి. మరమ్మతు చేయాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రధానోపాధ్యాయుడి కార్యాలయంతో పాటు ఇంటింటికీ ఇంటర్నెట్ సరఫరా చేసే టీ ఫైబర్‌ను తరగతి గదిలోనే ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు అవస్థ పడుతున్నారు.

పునాది వరకే..

అదనపు గది నిర్మాణం కోసం ఐదేళ్ల క్రితం పునాది వరకు నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం అది కూడా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా నూతన ప్రభుత్వంలో పాలకులు స్పందించి అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని తండావాసులు కోరుతున్నారు.

> **ప్రతిపాదనలు పంపించాం**
>
> మండలంలో ఉన్న పాఠశాలల్లో అదనపు గదుల కొరత ఉన్న పతి చోట కొత్త వాటి కోసం ప్రతిపాదనలు పంపిచాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయిన వెంటనే పనులు పూర్తి చేస్తాం. – కృష్ణయ్య, ఎంఈఓ, మదనాపురం

మొక్కల సంరక్షణపై దృష్టి



నర్సరీలోని మొక్కల వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అమరచింత: హరితహారంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల సంరక్షణపై పంచాయతీ కార్యదర్శులతో పాటు ఈజీఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నందిమళ్లలో నర్సరీ నిర్వహణను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల వారీగా ఇప్పటి వరకు నాటిన మొక్కలు, వాటిలో బతికున్న వాటి గురించి ఆరా తీశారు. నర్సరీలో అన్ని రకాలు పూల, పండ్ల మొక్కలు లభించేలా వాటిని పెంచాలని సూచించారు. గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలకు పంచాయతీ ట్యాంకర్ ద్వారా ప్రతినిత్యం నీటిని అందించి వేసవిలో మొక్కలు వాడుముఖం పట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొక్కలు ఎండిపోతే ఆయా గ్రామాల కార్యదర్శులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



కొత్తకోట రూరల్: ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల, మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ తేజస్విని తెలిపారు. విద్యార్థుల్లో రక్తహీనతను నిర్మూలించేందుకు ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు, రక్తహీనత గల విద్యార్థులు మంచి ఆహారం తీసుకోవాలని డాక్టర్ సూచించారు.

చిన్నారెడ్డి సేవలకు గౌరవం దక్కింది



చిన్నారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా మాజీ మంత్రి చిన్నారెడ్డి నియామకం కావడంతో సోమవారం వనపర్తి పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పదవి ఉన్నా.. లేకపోయిన ఓర్పు, సహనం, నేర్పుతో ఉండే గొప్ప నాయకుడు చిన్నారెడ్డి అని, ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి పదవిని కేబినేట్ హోదాతో కట్టబెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ నాయకుడు సయ్యద్ అక్బర్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు అనీస్, నాయకులు అబ్రార్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన డా.చిన్నారెడ్డిని సోమవారం ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్ కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ చిన్నారెడ్డి సేవలను గుర్తించి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. చిన్నారెడ్డిని కలిసిన వారిలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్‌గౌడు ఉన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్



శిథిల నీటి ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు

పాన్‌గల్: తెల్లరాళ్లపల్లిలోని భగత్‌సింగ్‌నగర్‌లో శిథిలమైన వాటర్ ట్యాంక్‌తో ప్రమాదం పొంచి ఉందని సీపీఐ కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి అన్నారు. సోమవారం పార్టీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి శిథిలమైన వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంకు పిల్లర్లు, మెట్లు ఇనుప సీకులు తెలి ట్యాంకు నుంచి నీరు లీకేజీ అవుతుందన్నారు. ట్యాంకు చుట్టూ నివాస గృహాలు ఉన్నాయని, పిల్లలు ఆడుకుంటూ ట్యాంకు పరిసరాల్లో ఉంటే అనుకోని విధంగా ట్యాంకుకు ఏమైనా అయితే ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారన్నారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే ట్యాంకును తొలగించి నూతన ట్యాంకు నిర్మించాలని, లేనిచో పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాల్, సహదేవ్, లింగన్న, రాముడు, కృష్ణయ్య, బీషన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలు, కేతేపల్లి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం అవుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ అన్నారు. కేతేపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. పరీక్షలు అంటే భయపడొద్దని, పరీక్షల సన్నద్ధతపై పలు సూచనలు, సలహాలు విద్యార్థులకు అందించారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

వనపర్తి టౌన్: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఖిల్లాఘనపురం, అత్మకూర్, రేవల్లి, వీపనగండ్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఏడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని, కార్మికుల ఆకలి పట్టదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్మికులు మోహన్, సత్తార్, సాయి కృష్ణ, మునీందర్, నాగయ్య, భీమయ్య, పార్వతమ్మ, చెన్నమ్మ, నాగమ్మ, నజమా బేగం, భాగ్యమ్మ, సత్యవతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలన అందరి బాధ్యత



తిప్పడంపల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శరత్

వీపనగండ్ల: పోలియో మహమ్మారిని సమాజం నుంచి పూర్తిగా వెలివేసేందుకు వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లకు పోలియో వ్యాధి నిర్మూలన కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన విధంగా పోలియో నిర్మూలన ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని కోరారు.

ఆత్మకూర్: పల్స్‌పోలియోపై గ్రామాల్లో అవగాహన కల్పించి, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తిప్పుడంపల్లి పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. పీహెచ్‌సీ పరిధిలో 5,257 మంది చిన్నారులు ఉన్నారని, మొత్తం 43 బూతులు, రెండు టాన్సిస్, ఒక మొబైల్ టీంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మార్చి 3, 4, 5వ తేదీల్లో చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సురేష్‌కుమార్, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం



పాన్‌గల్: నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. హెచ్‌సీ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన హైమావతి(20) వనపర్తిలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. శనివారం తల్లిదండ్రులు వనపర్తికి వెళ్లగా.. ఇంట్లో ఉన్న విద్యార్థిని తల్లిదండ్రులు వచ్చే సరికి కనిపించలేదు. దీంతో స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఎక్కడ ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం విద్యార్థిని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

యువకుడి అదృశ్యం



కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టకు చెందిన ఎరుకలి పద్మ, ఎరుకలి కొండన్న దంపతుల పెద్ద కుమారుడు ఎరుకలి హరీష్(22) గ్రామంలోనే ఉంటూ కూలీ పనిచేస్తుండేవాడు. ఈనెల 13న రాత్రి 8గంటల సమయంలో వికారాబాద్ వెళ్లి కూలీ పనులు చేస్తానని తల్లిదండ్రులతో చెప్పాడు. అందుకు వారు ఒప్పుకోలేదు. దీంతో 14న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. నాటి నుంచి నేటి వరకు బంధువుల వద్ద వెతికినా, స్నేహితులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. హరీష్ తల్లి ఫిర్యాదు మేరకు సోమవారం కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

పాత సీసీరోడ్డు తొలగింపుపై ఫిర్యాదు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో రఘువర్ధన్‌రెడ్డి పాత సీసీ రోడ్డును తొలగించి కొత్తగా సీసీ రోడ్డు వేసేందుకు ఉపక్రమిస్తున్నారని, అతడిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి, కుర్మమ్మ సోమవారం స్థానిక తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామపంచాయతీ బోరు వరకు వేసిన సీసీ రోడ్డును ఉద్దేశపూర్వకంగా తొలగించి ఎత్తుగా కొత్త సీసీ రోడ్డును వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దీంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి మిగతా కాలనీలో వారికి ఇబ్బందులు కలుగుతాయని, ఈ విషయమై విచారణ జరిపించాలని వారు ఆ విజ్ఞాపన పత్రంలో కోరారు.

నేడే మామిడి రైతులకు అవగాహన

వీపనగండ్ల: మండల కేంద్రంలోని రైతువేదికలో మామిడి తోటల రైతులకు పాలెం కేవీకే శాస్త్రవేత్తలతో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. ఈ అవగాహన సదస్సును కోరమాండల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలపై పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో పాటు ఉద్యానవనశాఖ అధికారులు రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మామిడి తోటల రైతులు పాల్గొనాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ట్రయల్ రన్

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్పించనున్న వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థపై సోమవారం నిర్వహించిన ట్రయల్ రన్‌ను మండల వ్యవసాయ శాఖ సిబ్బంది పరిశీలించారు. వీడియో కాన్ఫరెన్సింగ్ వ్యవస్థకు అవసరమగు టెలివిజన్, సెటప్ బాక్స్‌లు, ఇన్వర్టర్లు ఇతర సామగ్రిని రైతువేదికలో అమర్చారు. దీని పనితీరు తెలుసుకునేందుకు అగ్రికల్చర్ డైరెక్టర్, హైదరాబాద్ వారు ట్రయల్ రన్ నిర్వహించినట్లు ఏఓ సాజీద్ రహమాన్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా రైతువేదికలో రాష్ట్ర, జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడి సలహాలు అందిస్తారన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం



ఆత్మకూర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు



జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఆత్మకూర్: సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతులను బీజేపీ ప్రభుత్వం అణగదొక్కేందుకు కుట్రలు పన్నుతోందని సీపీఐఎంఎల్ ప్రజా పంథా, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో రైతులు, కార్మికులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఢిల్లీ సరిహద్దుల్లో లక్షలాదిమంది రైతులు నిరసన తెలుపుతుంటే వారి సమస్యలను పరిష్కరించగపోగా.. తీవ్రవాదులపై చేపడుతున్న చర్యలను రైతులపై చేపడుతున్నారని ఆరోపించారు. నరేంద్రమోదీ దేశంలోని కార్మికులను, రైతులను, మధ్యతరగతి కుటుంబాలను అణగదొక్కి అంబానీ, అదానీలకు మేలు చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజన్న, వెంకటయ్య, నర్సింహ, చెన్నయ్య, తిపుపతయ్య, మొగిలయ్య, పుల్లన్న, కుర్మన్న, రాములు, రాజు, సామేలు, అంజి, రైతులు, కార్మికులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: రైతులను పొట్టన పెట్టుకున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీహరి పిలుపునిచ్చారు. ఢిల్లీలో పంటలకు కనీస మద్దతు ధర చట్టం కోసం పోరాడుతున్న రైతులకు మద్దతుగా సీపీఐ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కళావతమ్మ, జె చంద్రయ్య, రాబర్టు, శ్రీరామ్,అబ్రహం, రాబర్టు, శ్యాంసుందర్, కృష్ణయ్య, రవీందర్, భాస్కర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రసాద్

మదనాపురం: కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు చీర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని దుప్పల్లిలో జరుగుతున్న ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా నేరుగా రోజుకూ రూ.600 కూలి ఇవ్వాలని, యంత్రాలతో పనులను నిషేధించి కూలీలకే 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవి కాలం దృష్ట్యా ప్రతి కూలీకి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పని ఫొటోలను అప్లోడ్ చేయాలన్న కేంద్ర ప్రభుత్వం నిబంధనను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రాక్టర్ లక్ష్మయ్య, వనజ, చిన్నమ్మ, పద్మ జయమ్మ, లక్ష్మి, జానమ్మ, సువార్త తదితరులు పాల్గొన్నారు.

నేడు శివ మహాపడి పూజ

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని శివాలయంలో మంగళవారం శివ మహాపడి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున స్వామివారికి పవిత్ర కృష్ణ జలాలతో అభి షేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. అనంతరం స్వామివారి కలశ ఊరేగింపు, పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 12 గంటలకు శివ మహాపడి కార్యక్రమం ఆలయ ఆవరణంలో ఉంటుందన్నారు. శివ మహాపడి పూజ కార్యక్రమంలో శివ మాలధారులే కాకుండా పట్టణ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులు ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలను బోధించారు. డీఓగా, ఎంఈఓగా, హెచ్ఎంలతో పాటు 20మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలను నిర్వర్తించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు కేశవాచారి, లక్ష్మారెడ్డి, రవికుమార్, చిలుకమ్మ, జన్నుభాస్కర్, పద్మావతమ్మ, సీఆర్పీ సౌమ్య న్నారు.

'బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి'



మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

ఆత్మకూర్: జాతి విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తున్న బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా కిసాన్‌సెల్ సమావేశాన్ని నిర్వహించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్రం దమనకాండ చేపడుతూ లాఠీలతో కొట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ఉసురు ఊరికే పోదని, దేశానికి అన్నం పెట్టే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీ ప్రభుత్వం భారీమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా ఈనెల 28న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం నుంచి నక్లెస్ రోడ్డు వరకు చేపట్టనున్న భారీ ర్యాలీలో రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, పాండురంగ, రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, పరమేష్, శ్రీను, లక్ష్మీకాంత్‌రెడ్డి, అరుణ్, భగవంతు, భాస్కర్, కృష్ణయ్య, రఘు, అజ్మత్, గంగ, దస్తగిరి, గడ్డం శ్రీనివాస్, షంషేర్, సాయిరాఘవ ఉన్నారు.

ఉర్సు జయప్రదం చేయండి

అమరచింత: పట్టణంలో వెలసిన శ్రీసయ్యద్‌షా రాజావలీ దర్గా షరీఫ్ ఉర్సును జయప్రదం చేయాలని దర్గా కమిటీ సభ్యులు ఖాజహుస్సేన్, రఫీ, ఇంతియాజ్ కోరారు. ఉర్సుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను సోమవారం టీపీసీసీ గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్‌కు అందించారు. మార్చి 1 నుంచి 3 వరకు మూడు రోజుల పాటు జరిగే రాజావలీ దర్గా ఉర్సుకు ఉమ్మడి జిల్లా ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటారన్నారు.